సాక్షి
ఏలూరు
మంగళవారం | 9 | జూలై | 2024



ఇంటికే రేషన్ హుళక్కేనా?

ఇంటికే ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీకి స్వస్తి చెప్పేలా మంత్రి నాదెండ్ల చేసిన ప్రకటన తీవ్ర చర్చనీయాంశమైంది. 8లో



కేవీకేలు రైతు నేస్తాలు

కృషి విజ్ఞాన కేంద్రాలు (కేవీకే) రైతు నేస్తాలని శాస్త్రవేత్తలు అన్నారు. ఎన్నార్పీ అగ్రహారంలోని కేవీకేలో స్వర్ణోత్సవాలు నిర్వహిస్తున్నారు. 8లో



నాటిక పోటీల విజేత ఇంద్రప్రస్థం

ఏలూరులో నాలుగు రోజులపాటు జరిగిన అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో ఇంద్రప్రస్థం నాటిక విజేతగా నిలిచింది. 8లో

న్యూస్‌రీల్

కలెక్టర్ సుడిగాలి పర్యటన



సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువస్తున్న వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మణరావు

కుక్కునూరు: కుక్కునూరు మండల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కె.వెట్రి సెల్వి ఆదేశించారు. కుక్కునూరు మండలం ఇబ్రహీంపేటలో సోమవారం ఆమె పర్యటించారు. మండలంలోని గోదావరి గట్టును ఆనుకుని ఉన్న ప్రజలకు పోలవరం ప్రాజెక్ట్ నష్టపరిహారం అందలేదని స్థానికులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. యువతకు ఉపాధి కల్పించాలని, భూమికి భూమి పరిహారం ఇప్పించాలని కోరారు. పెద్దరాయిగూడెం ఉన్నత పాఠశాలలో, బోరప్పాడులోని పాఠశాలలో టాయిలెట్లు లేవని, ఉప్పెనపల్లిలోని పాఠశాలలో టాయిలెట్లు, తాగునీరు లేవని ప్రజలు తెలియజేశారు. తమ గ్రామంలో త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ లేదని రైతులు తెలియజేయగా వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పోషకాహారం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని మాధవరం పంచాయతీ దామచర్లలోని పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీలో ఆమె పర్యటించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేసి ఆహారాన్ని రుచిచూశారు. ఎల్లప్పగూడేనికి చెందిన ప్రజలు తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో సొమ్ములు, ఇల్లు అందలేదని తెలియజేయగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఆర్డీఓ కె.అద్దయ్య, తహసీల్దార్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

ఏఎస్సైలకు పదోన్నతి

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలో ఆరుగురు ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతులు కల్పించారు. ఈమేరకు జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పి.సైమన్ (జీఆర్‌పీ విజయవాడ) పోలీస్ కమిషనరేట్‌కు, కె.సాంబశివరావు (చేబ్రోలు) ఏలూరు జిల్లాకు, వై.కృపాదానం (ఏలూరు రూరల్) పోలీస్ కమిషనరేట్‌కు, బి.ఆనందబాబు (ఏలూరు టూటౌన్) పోలీస్ కమిషనరేట్‌కు, ఆర్.రాంబాబు (ద్వారకాతిరుమల), ఎం.అర్జునరావు (ఏలూరు టూటౌన్) ఏఎస్‌ఆర్ జిల్లా పాడేరుకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

234 అర్జీల స్వీకరణ

ఏలూరు(మెట్రో) : ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థ (మీకోసం)లో వచ్చిన అర్జీలను త్వరితగతిన నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌ఓ డి.పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు భాస్కరరావు, ముక్కంటి, ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలితో కలిసి ప్రజల 234 అర్జీలు స్వీకరించారు.

డీజీపీకి వినతి

ఏలూరు టౌన్ : ఎన్నికల విధుల్లో భాగంగా ఆయా జిల్లాలకు బదిలీ చేసిన పోలీసు అధికారులను తిరిగి వారి జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతూ రాష్ట్ర డీజీపీ ద్వారకాతిరుమలరావుకు వినతిపత్రం అందజేశామని పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాసరావు, రాష్ట్ర కమిటీతో కలిసి డీజీపీకు వినతిపత్రం అందజేశామన్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తులు

కామవరపుకోట : జిల్లా పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పని చేస్తున్న అధ్యాపకులను 2024–25 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కామవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయబాబు సోమవారం ప్రకటనలో తెలిపారు. గత విద్యా సంవత్సరంలో ఏప్రిల్ 30 వరకు పనిచేసిన కాంట్రాక్ట్ అధ్యాపకులు ఈనెల 9న సాయంత్రం 5 గంటలలోపు ఆయా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 15న జిల్లా ఎంపిక కమిటీ సమక్షంలో ఏలూరు కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

శ్రీరామవరంలో పోలీస్ పికెట్

దెందులూరు: సమస్య ఉన్న ఏ గ్రామంలోనైనా పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటుందని, శ్రీరామవరం గ్రామంలో నెలకొన్న పరిస్థితి దృష్ట్యా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి తెలిపారు. సోమవారం దెందులూరు పోలీస్‌స్టేషన్‌ను ఆమె సందర్శించి ప్రతి గ్రామంలో పరిస్థితులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సీఐ కె.శ్రీనివాసకుమార్, ఎస్సై కె.స్వామి ఉన్నారు.



ద్వారకాతిరుమల : పంగిడిగూడెంలో కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి తానేటి వనిత



కైకలూరు : వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ



నూజివీడు : వైఎస్సార్ జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు

మది మదిలో.. జన హృదిలో..



భీమవరం : వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

మనసా స్మరామి

- మాజీ సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి
- వాడవాడలా 75వ జయంతి వేడుకలు
- పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు : అపర భగీరథుడు.. సంక్షేమ శేఖరుడు.. అభివృద్ధి ప్రదాత.. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. జన హృదయ నేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్షీరాభిషేకాలు, రక్తదాన శిబిరాలు జరిగాయి.

- ఏలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ఆళ్ల నాని, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ముఖ్యనేతలు సమావేశం నిర్వహించి జిల్లాకు వైఎస్సార్ చేసిన మేలును కొనియాడారు.
- ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంలో పార్టీ నేత పెదబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు మాజీ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- చింతలపూడి నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త కంభం విజయరాజు నేతృత్వంలో కార్యక్రమాలు జరిగాయి. చింతలపూడి, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాల్లో వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు క్షీరాభిషేకాలు చేశారు. చింతలపూడిలో అన్నదానం, సీతానగరంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.
- కైకలూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణలు సంత మార్కెట్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. నాలుగు మండలాల్లో నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాలు నిర్వహించారు.
- నూజివీడు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు బాపునగర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చినగాంధీ బొమ్మ సెంటరులో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలో అన్ని మండలాల్లో జయంతి కార్యక్రమాలు జరిగాయి.
- పోలవరం నియోజకవర్గం బుట్టాయగూడెం మండలంలో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నేతృత్వంలో వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అన్ని మండలాల్లో జయంతి వేడుకలు పార్టీ శ్రేణులు నిర్వహించారు.
- ఉంగుటూరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సోదరుడు పుప్పాల చినబాబు, మండల పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.
- దెందులూరు నియోజకవర్గంలోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పార్టీ మండల నాయకులు, నియోజకవర్గ నాయకులు పాల్గొని వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఏలూరు టౌన్ : కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని, ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి



చింతలపూడి : అన్నదానం చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు



బుట్టాయగూడెం : రోగులకు రొట్టెలు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



నిడమర్రు : బువ్వనపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని

ఏలూరు టౌన్ : వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామని, రానున్న రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరు ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ ముఖ్య నేతలు, కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులతో ఆయన సమీక్షించారు. ఏలూరు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఆయా నియోజకవర్గాల్లో జరుగుతున్న పరిణామాలపై పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు మేలు చేసేలా పలు సంక్షేమ పథకాలు అమలు చేశారని చెప్పారు. అయితే దురదృష్టవశాత్తు ఎన్నికల్లో పార్టీ పరాజయం కావడం బాధ కలిగించినా భవిష్యత్తులో పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తూ ప్రతి కార్యకర్తకు అండగా నిలిచేందుకు బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఒత్తిడి తెస్తామన్నారు. ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్, మాజీ ఇడా చైర్మన్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు గుడి దేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కో–ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని. చిత్రంలో సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్

గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కోవాలి

కలెక్టర్ వెట్రి సెల్వి

వేలేరుపాడు: గోదావరి వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ వెట్రి సెల్వి అన్నారు. సోమవారం వేలేరుపాడు ఐకేపీ కార్యాలయంలో వరదల ముందస్తు చర్యలపై అధికారులతో ఆమె సమీక్షించారు. 2022లో వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రమాద హెచ్చరికలకు అనుగుణంగా ముంపు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాలేదని నిర్వాసితులు దిగులు పడవద్దని త్వరలో ప్యాకేజీ కూడా అందించే అవకాశాలు ఉన్నాయన్నారు. వేలేరుపాడు మండలంలో 69 మంది గర్భిణులు ఉన్నారని వారితో పాటు చిన్నపిల్లలు, వృద్ధుల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. లాంచీలు, బోట్‌లు, దేశీయ పడవలు, లైఫ్ జాకెట్లు, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలన్నారు. ముంపు గ్రామాలను బట్టి పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల్లో మౌలిక వసతులు, తాగునీరు, భోజన సౌకర్యం, విద్యుత్ సౌకర్యాలు కల్పించాలన్నారు. బఫర్ స్టాక్ మూడు నెలలు సరిపడా బియ్యం, కందిపప్పు, వంటనూనె తదితర నిత్యావసరాలను కూడా సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ జనరేటర్లు, కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతినకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సురేష్‌కు సూచించారు. ఈ సందర్భంగా పలు సమస్యల్ని నిర్వాసితులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. 41 కాంటూర్‌లో ఉన్న గ్రామాల నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పటివరకు అందలేదని వివరించగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ సూర్యతేజ, ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కె.అద్దయ్య, ఆర్‌టీసీ ఎండీ మదానీ, డీఎల్‌పీఓ రజీవుల్లా, జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి రాజీవ్, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీఓ శ్రీహరి, జెడ్పీటీసీ గుజ్జా రామలక్ష్మి, ఎంపీపీ వాళ్ల లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ఇంటర్వ్యూకి వెళ్లొస్తూ.. మృత్యు ఒడికి..

- కంటైనర్‌ను ఢీకొట్టిన కారు
- ముగ్గురు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

ద్వారకాతిరుమల : సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించి భర్తతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడాలనుకుంది. రత్నాల్లాంటి ఇద్దరు బిడ్డలకు మంచి భవిష్యత్ ఇవ్వాలని ఎన్నో కలలు కంది. సాఫ్ట్‌వేర్ కంపెనీ నుంచి ఇంటర్వ్యూకు పిలుపురాగానే సంబరపడిపోయింది. ఉద్యోగం ఎలాగైనా సాధించాలన్న పట్టుదలతో అడుగు ముందుకేసింది. అయితే అకాల మృత్యువు ఆమె కలలను చెరిపివేసింది. రోడ్డు ప్రమాదానికి గురై తన తల్లి, బిడ్డతో సహా ఆమె అసువులు బాసింది. వీడని బంధంలా మృత్యువులోనూ ఆమె ఒడిలో బిడ్డ పడి ఉన్న దృశ్యాలు కలచివేశాయి. ఈ హృదయ విదారక ఘటన ద్వారకాతిరుమల మండలం మారంపల్లి పంచాయతీ పరిధిలోని లక్ష్మీనగర్ జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున చోటుచేసుకుంది. రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలుకి చెందిన రాచాబత్తుని నాగార్జున హైదరాబాద్‌లో ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ ఎండీగా చేస్తున్నారు. సాఫ్ట్‌వేర్ కొలువు సాధించి భర్తతో కలిసి హైదరాబాద్‌లో స్థిరపడాలని భావించిన నాగార్జున భార్య భాగ్యశ్రీ (30), కుమారుడు నాగ నితిన్‌కుమార్ (4), నాగ షణ్ముఖ, తల్లిదండ్రులు బొమ్మా నారాయణరావు, కమలాదేవి (57)తో కలిసి హైదరాబాద్‌కు కారులో వెళ్లి వస్తుండగా లక్ష్మీనగర్‌లో రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి వేగంగా ఢీకొట్టారు. దీంతో భాగ్యశ్రీ, కమలాదేవి, నాగ నితిన్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందగా, నాగ షణ్ముఖ, డ్రైవర్ దీవి వంశీకృష్ణకు తీవ్రగాయాలయ్యాయి. తండ్రి నారాయణరావు మార్గమధ్యలో విజయవాడలో కారు దిగిపోవడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు



రాచాబత్తుని భాగ్యశ్రీ, నాగ నితిన్ కుమార్, బొమ్మా కమలాదేవి మృతదేహాలు



ఘటనా స్థలంలో రోదిస్తున్న మృతుల బంధువు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

క్లుప్తంగా

తాడువాయిలో చోరీ



తాడువాయిలో పసుమర్తి ఏడుకొండలు ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

జంగారెడ్డిగూడెం: కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రిస్తుండగానే ఇంట్లోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారపు ఆభరణాలు, వెండి అపహరించారు. ఈ ఘటనకు సంబంధించి ఏఎస్సై వై.మంగయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన పసుమర్తి ఏడుకొండలు ఈ నెల 7వ తేదీ రాత్రి భోజనం అనంతరం కుటుంబసభ్యులతో ఆరుబయట నిద్రించారు. 8వ తేదీ ఉదయం లేచి చూడగా, ఇంటి వెనుక తలుపు గొళ్లెం ఊడదీసి, లోనికి ప్రవేశించి బెడ్‌రూమ్‌లోని బీరువా తాళాలు పగులగొట్టి, అందులో ఉండాల్సిన 9 కాసుల బంగారు ఆభరణాలు, అరకేజీ వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో చోరీకి గురైనట్లు గుర్తించి బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. మంగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

వాహనచోదకులు తప్పక హెల్మెట్ ధరించాలి



ఎ.నాగశైలజ

నూజివీడు: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఏ నాగశైలజ అన్నారు. నూజివీడు పట్టణంలోని కోర్టు ఆవరణలో సోమవారం ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేకపోవడం వలన అధిక శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. హైకోర్టు వారు పిల్ నంబర్ 116/24లో ఇచ్చిన స్పష్టమైన ఉత్తర్వుల మేరకు హెల్మెట్ ధరించాలని, లేనిపక్షంలో కేసులు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే సమయంలో అనుకోని విధంగా ప్రమాదం సంభవిస్తే హెల్మెట్ ధరించి ఉన్నట్లయితే ప్రాణాపాయం తప్పుతుందన్నారు. వాహన చోదకులు రోడ్డుపై జరగబోయే ప్రమాదాలను ముందుగా ఊహించి తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని అన్నారు. తాజాగా హైకోర్టు వారి ఆదేశాల మేరకు కేసులు నమోదు చేయడంతో పాటు కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

6 ట్రాక్టర్ల సీజ్

చాట్రాయి: మట్టి అక్రమంగా తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మహ్మద్ మసూద్ అలీ చెప్పారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాట్రాయిలో ఎటువంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లను అడ్డుకుని వాటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు.

12 నుంచి గరికపాటి ప్రవచనాలు

భీమవరం: పట్టణంలో ఈ నెల 12 నుంచి మహాసహస్రావధాని గరికపాటి నరసింహారావుతో శ్రవణ కుమారుడి ప్రవచనం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ప్రిన్సిపాల్ దాయన సురేష్ చంద్రజీ సోమవారం తెలిపారు.

ఇంటింటికీ రేషన్ హుళక్కేనా?

- ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటా రేషన్ పంపిణీకి మంగళం?
- జిల్లాలో మూతపడనున్న 356 ఎండీయూ వాహనాలు
- కూటమి సర్కారు తీరుతో కార్డుదారుల్లో అనుమానాలు
- మళ్లీ కనిపించనున్న రేషన్ షాపుల వద్ద పడిగాపుల దృశ్యాలు
- జిల్లాలో 5,70,916 మంది తెల్ల కార్డుదారులు



ఎండీయూ వాహనం ద్వారా రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్)



నరసాపురం ప్రాంతంలో ఎండీయూ ద్వారా సేవలందిస్తున్న దృశ్యం (ఫైల్)

ఆకివీడు: వైఎస్ జగన్ సర్కారు అమలు చేసిన ప్రజాదరణ చూరగొన్న సంక్షేమ పథకాల పేర్ల మార్పే కాదు, వాటి విధానాలకు తిలోదకాలిచ్చి ప్రజల తలరాతల్ని కూటమి ప్రభుత్వం మార్చివేస్తోంది. సంక్షేమ పథకాల్ని అమలు జరుపుతూనే కొత్త సంక్షేమ, అభివృద్ధి పథకాలను తీసుకువస్తామని చెప్పి ఎన్నికల్లో గెలిచిన కూటమి ప్రభుత్వం నెల రోజులు తిరగకుండానే సంక్షేమ పథకాల అమలుపై ఆయా శాఖల మంత్రులు మాట్లాడుతున్న తీరు ప్రజల్ని అయోమయంలో పడవేస్తున్నాయి. ఎన్టీ రామారావు ప్రవేశపెట్టిన అతి ముఖ్యమైన బియ్యం పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కిలో రూపాయికే పంపిణీ చేసి కొనసాగించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఈ విధానాన్ని మరింత మెరుగ్గా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) వాహనాల ద్వారా ప్రజల ఇళ్లకే వెళ్లి రేషన్ బియ్యం సరఫరా చేశారు. అయితే ఎండీయూ పథకానికి స్వస్తి చెప్పేలా ప్రస్తుత ప్రభుత్వంలో శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. వృద్ధులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, వితంతువులతోపాటు రేషన్ పొందుతున్న వినియోగదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ చౌకబారు మార్పులు మాకొద్దంటూ పలువురు వాపోతున్నారు.

8,000 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

అత్యంత ప్రతిష్టాత్మకంగా రేషన్ బియ్యం పంపిణీ విధానాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. 2021 జనవరి 21వ తేదీన ఎండీయూ వాహనాలను ఆయన ప్రారంభించారు. ఫిబ్రవరిలో అన్ని గ్రామాల్లో పంపిణీ ప్రారంభమైంది. ఎండీయూ వాహనాల ద్వారా ప్రతి నెలా పశ్చిమగోదావరి జిల్లాలో సుమారుగా 8,000 మెట్రిక్ టన్నులకు పైగా బియ్యాన్ని ప్రజల చెంతకు చేరవేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి 5,70,916 మంది రేషన్ కార్డు దారులకు బియ్యం సరఫరా చేస్తున్నారు. ఇంటర్‌నెట్ అందుబాటులో లేకపోయినా, సర్వర్లు పనిచేయకపోయినా, ఇంటి వద్ద యజమాని లేకపోయినా, వీధి రోడ్లు అధ్వానంగా ఉన్నప్పటికీ ఓర్పు, సహనంతో 356 ఎండీయూ ఆపరేటర్లు బియ్యం లోడు వాహనాలతో ఆయా ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులకు నిజాయతీగా బియ్యం అందజేస్తూ వస్తున్నారు. తూకంలో ఏ విధమైన లోపం లేకుండా, కార్డుదారుడికి 5 కేజీల బియ్యం వారి ముందే తూచి అప్పగిస్తున్నారు. ఉచిత బియ్యమైనప్పటికీ ఒక్క గింజ తేడా లేకుండా ఎండీయూల ద్వారా పంపిణీ జరిగింది. ఈ-పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో ప్రజా పంపిణీ విధానం కొనసాగింది. ఎండీయూల ద్వారా ఇంటింటికీ బియ్యం సరఫరా చేయిస్తూనే, జిల్లాలోని 1052 రేషన్ షాపుల ద్వారా రేషన్ బియ్యాన్ని ఆయా డీలర్ల నుంచి ఎండీయూలకు చేరవేసే పద్ధతిని కొనసాగించారు.

బిక్కుబిక్కుమంటున్న ఎండీయూ ఆపరేటర్లు

వాహనాల ద్వారా రేషన్ బియ్యం సరఫరాపై ఆ శాఖ మంత్రి చేసిన వ్యాఖ్యలతో తాము ఉపాధి కోల్పోతామేమోనన్న ఆందోళనలో ఎండీయూ నిర్వాహకులు ఉన్నారు. ఐదేళ్లు సేవలందించిన తమ సేవల్ని నిర్వీర్యం చేయడమే కాకుండా, మా జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో వైఎస్ జగన్ సర్కారు బ్యాంకుల లింకేజీతో ఒక్కో వాహనాన్ని రూ.5.80 లక్షల చొప్పున అందజేశారు. లబ్ధిదారుడు నెలకు రూ.3 వేలు చెల్లింస్తుండగా, ప్రభుత్వం రూ.8 వేలు ప్రతి నెలా బ్యాంకులకు చెల్లిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎండీయూ నిర్వాహకులు సేవలందించారు. ఇప్పుడు ఇంటింటికీ రేషన పంపిణీ పథకం రద్దు అయితే వాహనాల సంగతేమిటి, తమ పరిస్థితి ఏమిటని నిర్వాహకులు వాపోతున్నారు.

దేశానికి ఆదర్శం

రేషన్ పంపిణీలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిన విధానంపై దేశంలోని పలు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ఎండీయూ పథకం దేశానికే ఆదర్శంగా ఉంటే రాష్ట్రంలో తూట్లు పొడిచే దిశగా ఆలోచనలు ఉన్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది.

ఈ విధానాన్నే కొనసాగించాలి



రేషన్ కష్టాల్ని తొలగించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ పంపిణీ విధానాన్నే కొనసాగించాలి. ఇంటికే వచ్చి రేషన్ ఇవ్వడం వల్ల లబ్ధిదారులు తమ పనుల్ని మానుకోవాల్సిన అవసరం లేకుండా ఉంది. సకాలంలో వారికి రేషన్ బియ్యం అందుతున్నాయి. ఈ విధానాన్ని కొనసాగించాలి.

– నాతిరెడ్డి ఆదిలక్ష్మి, సర్పంచ్, చినకాపవరం, ఆకివీడు మండలం

కష్టకాలంలోనూ సేవలందించాం



కష్టకాలంలో ఎనలేని సేవలందించిన మాపై లేనిపోని నిందలు వేయడం తగదు. కాకినాడ పోర్టు గొడౌన్లలో ఉన్న అక్రమ బియ్యానికి మాకు ఏ విధమైన సంబంధం లేదు. మేము నిజాయతీగా పేదల ఇళ్లకు వెళ్లి పక్కా కొలతతో రేషన్ అందజేశాం. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది.

– జువ్వల ప్రేమ్‌కుమార్, ఎండీయూ ఆపరేటర్ల సంఘు జిల్లా అధ్యక్షులు, నర్సాపురం

నిధుల దుర్వినియోగంపై మరోసారి ఫిర్యాదు



ఫిర్యాదు రశీదును చూపిస్తున్న నిమ్మగడ్డ అముక్త

ఏలూరు (మెట్రో): ద్వారకాతిరుమలలో పంచాయతీ అధికారులు, సర్పంచ్ కలిసి రూ.2.25 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపిస్తూ ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ లావణ్యవేణికి పంచాయతీకి చెందిన నిమ్మగడ్డ అముక్త ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆమె జేసీకి అర్జీని అందజేశారు. ఈ సందర్భంగా అముక్త మాట్లాడుతూ నిధుల దుర్వినియోగంలో గ్రేడ్–1 సెక్రటరీ లంకలపల్లి వెంకటేశ్వరరావు రూ.1,43,44,700, మాజీ ఎంపీడీవో ఆశీర్వాదం రూ.20,60,611, ద్వారకా తిరుమల గ్రామ సర్పంచ్ 61,28,051 నిధులు స్వాహా చేశారని ఆరోపిస్తూ వారిపై గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పనిచేసిన ప్రసన్న వెంకటేష్‌కు ఫిర్యాదు చేశానన్నారు. దీనిపై ప్రసన్న వెంకటేష్ స్పందించి డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్‌కు, డీఆర్‌పీవో రహమతుల్లాను విచారణ చేయాలని ఆదేశించారన్నారు. సదరు అధికారులు నిధుల దుర్వినియోగం నిర్ధారిస్తూ, సదరు విచారణ నివేదికను కలెక్టర్ అందించారన్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఏ చర్యలూ తీసుకోలేదని, దీంతో తాను మరోసారి ఏలూరు కలెక్టరేట్‌లో ప్రజా సమస్య పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సొమ్మును రికవరీ చేసి బాధ్యులను శిక్షించాలని అర్జీని అందించినట్లు నిమ్మగడ్డ అముక్త తెలియజేశారు.

నాటిక పోటీల విజేత 'ఇంద్రప్రస్థం'



నాటిక పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ), హేలాపురి కళాపరిషత్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీల్లో ఇంద్రప్రస్థం నాటిక విజేతగా నిలిచింది. ఆదివారం రాత్రి నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలైన నాటిక బృందాలకు అతిథులు బహుమతులు అందజేశారు. విజేతగా నిలిచిన ఇంద్రప్రస్థం బృందానికి రూ.8 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రాత నాటిక బృందానికి రూ.5 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన కౌసల్య సుప్రజ రామ బృందానికి రూ.3 వేలు నగదు బహుమతులు అందజేశారు. ఉత్తమ నటునిగా ఎస్.రవీంద్ర, ద్వితీయ ఉత్తమ నటునిగా పీ శ్రీనివాసరావు, ఉత్తమ నటిగా టీ శ్రీలేఖ, ద్వితీయ ఉత్తమ నటిగా సురభి ప్రభావతి, ఉత్తమ ప్రతినాయకునిగా ఏపూరి హరిబాబు, ఉత్తమ హాస్య నటునిగా పూర్ణ సత్యం, ఉత్తమ బాలనటిగా సురభి వాగ్దేవి, ఉత్తమ సంగీతం పీ లీలామోహన్, ఉత్తమ రచనలుగా ఇంద్రప్రస్థం (స్నిగ్ధ), రాత (శ్రీనివాసరావు పోలదాసు), ఉత్తమ దర్శకునిగా శ్రీనివాసరావు పోలదాసు బహుమతులు అందుకున్నారు. బహుమతి ప్రదానోత్సవ సభకు అతిథులుగా వైఎంహెచ్‌ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఇరదల ముద్దుకృష్ణ, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షులు జవ్వాజి మోహన్ విఠల్, ప్రధాన కార్యదర్శి మజ్జి సూర్య కాంతారావు, సంస్థ సభ్యులు, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు లంకా వెంకటేశ్వర్లు, హేలాపురి కళాపరిషత్ అధ్యక్షులు పెదపాటి రామకృష్ణ, గౌరవ అధ్యక్షులు గుత్తా కొనలేంద్రరావు, కార్యదర్శి సంకు సురేష్, కోశాధికారి ఎండీ ఖాజావలి, పైడి భీమేశ్వరరావు, ఘంటసాల పెద్దిరాజు, ఎం.సూర్యనారాయణ యాదవ్, పచ్చ కృష్ణానందరావు, చన్నా వెంకటరామయ్య, వీ రేవతి, కొల్లి మోహన్‌రావు, ఎంవీ సోమేశ్వరరావు, జిల్లెళ్ల మూడి వరప్రసాదరావు, కేసా సాంబశివరావు, బీ విశ్వనాథచారి పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరుకు పతకాల పంట



స్విమ్మింగ్ పోటీల్లో పతకాలు సాధించిన బాలలు

ఏలూరు రూరల్: కేంద్రీయ విద్యాలయాల రీజినల్ స్విమ్మింగ్ పోటీల్లో ఏలూరు విద్యార్థులు 15 పతకాలు సాధించారని శాప్ స్విమ్మింగ్ కోచ్ గణేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లో కేంద్రీయ విద్యాలయాల ఆటల పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో ఏలూరు భిశ్వనాథ్ స్విమ్మింగ్ పూల్ వద్ద శిక్షణ పొందుతున్న గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు 7 గోల్డ్‌మెడల్స్, 5 సిల్వర్, 3 బ్రాంజ్‌మెడల్స్ సాధించారన్నారు. ఇందులో 50, 100 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో మరియన్న రెండు బంగారు పతకాలు, ఎం.ధనుష్‌సాయి 50, 100 మీటర్ల ఫ్రీస్టైల్, 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో మూడు బంగారు పతకాలు సొంతం చేసుకున్నాడన్నారు. మరోవైపు ఎం.రిషీరామ్ 50, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు, ఎం.సంజయ్ 50 మీటర్ల బటర్‌ఫ్లై, 100 మీటర్ల ఫ్రీస్టైల్‌లో 1 సిల్వర్, మరొక బ్రాంజ్‌మెడల్ చేజిక్కించుకున్నారని వివరించారు. అలాగే టి.అవినాష్ 100 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో ఒక సిల్వర్ మెడల్, 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో బ్రాంజ్ మెడల్, టి.విష్ణువర్ధన్ 50, 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్ అంశంలో మూడు సిల్వర్ మెడల్స్, ఎం.రోయ్‌సన్ 50 మీటర్ల బటర్‌ఫ్లై అంశంలో బ్రాంజ్‌మెడల్ సాధించారని పేర్కొన్నారు. వీరిని డిఎస్‌డీఓ శ్రీనివాస్ అభినందించారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి 6 నెలల జైలు

చింతలపూడి: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు 6 నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన మందపాటి వెంకటేశ్వరమ్మ చింతలపూడిలోని లక్ష్మీఫాస్ట్ ఫుడ్ హోటల్‌లో పనిచేస్తోంది. 2022 మే 22వ తేదీన తన ఇంటి నుంచి చింతలపూడికి స్కూటీపై వెళుతుండగా, మార్గమధ్యలో వాహనం ఆగిపోయింది. దీంతో బస్సు కోసం ఎదురుచూస్తుండగా, చింతలపూడి వైపు మోటార్‌సైకిల్‌పై వెళుతున్న యర్రగుంటపల్లికి చెందిన పెరుమాళ్ల సువర్ణరాజు చింతలపూడి వరకు లిఫ్ట్ ఇస్తానని వెంకటేశ్వరమ్మను మోటార్ సైకిల్‌పై ఎక్కించుకున్నాడు. రేచర్ల గ్రామ శివారుకు వచ్చేసరికి మోటార్‌సైకిల్‌ను పక్కకు ఆపి, వెంకటేశ్వరమ్మను పక్కనే ఉన్న ఆయిల్‌పామ్ తోటలోకి తీసుకువెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించాడు. తన కోరిక తీర్చమని ఆమెను ఇబ్బంది పెట్టగా, అక్కడ నుంచి వెంకటేశ్వరమ్మ తప్పించుకుని, జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రుల సహాయంతో చింతలపూడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై పి.చెన్నారావు కేసు నమోదు చేశారు. దీనిపై కోర్టులో విచారణ జరగ్గా నిందితుడి నేరం రుజువు కావడంతో జడ్జి సీహెచ్ మధుబాబు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని సీఐ ఎం.సుధాకర్ తెలిపారు. పీపీ వి.సామయ్య ప్రాసిక్యూషన్ నిర్వహించగా, ఎస్సై ఎం.కుటుంబరావు, కోర్టు కానిస్టేబుల్ ఎన్కే భగవాన్ సహకరించారు.

ఎన్‌ఎంఎంఎస్ మెరిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకోండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గత ఏడాది డిసెంబర్ 3వ తేదీన నిర్వహించిన జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)లో ఎంపికైన విద్యార్థులు తమ మెరిట్ కార్డులను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ 'బీఎస్ఈఏపీ' నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని డీఈఓ ఎస్.అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు డౌన్‌లోడ్ చేసుకున్న మెరిట్‌కార్డులో వారి పేరు, పుట్టిన తేదీ, తండ్రి లేదా తల్లిపేరు మొదలైన వివరాలు వారి ఆధార్ కార్డుపై ఉన్న విధంగానే ఉన్నవో లేదో తనిఖీ చేసుకుని జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో వచ్చే ఆగస్టు 31వ తేదీ లోపు దరఖాస్తు సమర్పించి సంబంధిత స్కూల్ నోడల్ అధికారి, జిల్లా నోడల్ అధికారి లాగిన్ ద్వారా దరఖాస్తును ధ్రువీకరించుకోవాలన్నారు. మెరిట్ కార్డులు ఏలూరులోని డీఈఓ కార్యాలయానికి చేరిన తరువాత సంబంధిత ఉప విద్యాశాఖాధికారులకు పంపిస్తామన్నారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డులోను, బ్యాంక్ పాస్‌బుక్ లోనూ ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వివరాలు సరిపోలని విద్యార్థులు వెంటనే ఆధార్ మిస్‌మ్యాచ్ వివరాలను సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

'అగ్నివీర్'లో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): భారత వాయుసేనలో అగ్నివీర్ పథకంలో భాగంగా ఉద్యోగాల నియామకం కోసం భారత వాయుసేన నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా ఉపాధి అధికారి సి.మధుభూషణరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు 2004 జూలై నుంచి 2008 జనవరి మధ్య జన్మించిన స్త్రీ/పురుష అభ్యర్థులు అర్హులన్నారు. మేథ్స్, ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో ఇంటర్మీడియేట్‌లో, ఒకేషనల్ లేదా పాలిటెక్నిక్‌లలో కనీసం 50 శాతం మార్కులతో పాస్ అయిన వారు అగ్నిపథ్ వెబ్‌సైట్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆన్‌లైన్ పరీక్ష అక్టోబర్ 10వ తేదీ నుంచి నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులకు ఈ ఉద్యోగాలపై అవగాహన కలుగజేసేందుకు ఈ నెల 12న భీమవరంలోని డీఎన్ఆర్ డిగ్రీ కాలేజ్‌లో, 16న ఏలూరులోని సర్ సీఆర్ఆర్ రెడ్డి కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాయుసేన సికింద్రాబాద్ వారితో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరుళ్లలో మహిళ దారుణ హత్య

తాడేపల్లిగూడెం అర్బన్: ఆరుళ్ల సమీపంలో ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. కొన్ని రోజుల క్రితమే ఈ హత్య జరగగా, దుర్వాసన వస్తోందని స్థానికులిచ్చిన సమాచారంతో పోలీసులు మహిళ మృతదేహాన్ని గుర్తించడంతో హత్య విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆరుగొలను గ్రామానికి చెందిన జనపాముల సత్యవతి (48) వారం క్రితం తాడేపల్లిగూడెంలోని బంధువుల ఇంట్లో నిర్వహించిన శుభకార్యానికి వెళ్లింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ కుటుంబ సభ్యులకు తెలియలేదు. వారం రోజులైనా తల్లి ఇంటికి రాకపోవడంతో ఆమె కుమార్తె బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో తన తల్లి కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. ఇదిలా ఉండగా ఆరుళ్ల గ్రామస్తులు రహదారిలో రాకపోకలు సాగిస్తుండగా భరించలేని దుర్వాసన వస్తోందని పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సుధాకర్‌రెడ్డి సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, మహిళ మృతదేహాన్ని ఆరుగొలను గ్రామానికి చెందిన జనపాముల సత్యవతిగా గుర్తించారు. వివాహేతర సంబంధం నేపథ్యంలో ఆమెను గొంతు నులిమి హత్య చేసి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కృషి విజ్ఞాన కేంద్రాలు రైతు నేస్తాలు



ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో స్వర్ణోత్సవ జ్యోతితో శాస్త్రవేత్తలు

ఉండి: కృషీ విజ్ఞాన కేంద్రాలు రైతు నేస్తాలని పలువురు శాస్త్రవేత్తలు అన్నారు. దేశంలో మొదటి కేవీకే పాండిచ్చేరిలో స్థాపించి 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో దేశంలోని అన్ని కేవీకేల్లో స్వర్ణోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చేపట్టిన స్వర్ణోత్సవ జ్యోతియాత్ర వెంకట్రామన్నగూడెం కేవీకే నుంచి ఎన్నార్పీ అగ్రహారం కేవీకేకు సోమవారం చేరుకోగా, శాస్త్రవేత్తలు, రైతులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన రైతు శిక్షణ సదస్సులో ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ డాక్టర్ దండు జగన్నాథరాజు, మార్టేరు మాజీ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ కె.సూర్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కేవీకే ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు సదస్సుకు అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథి డాక్టర్ కే సూర్యనారాయణ మాట్లాడారు. ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో పంటల యాజమాన్య విభాగంలో నాలుగేళ్లపాటు చౌడునేల అభివృద్ధిపై తాను చేసిన పరిశోధనలను వివరించారు. మాండులెజ్ సంస్థ అసిస్టెంట్ మేనేజర్ జే విజయ్‌కుమార్ మాట్లాడుతూ కోకో పంటలో ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆర్జించే అవకాశాలున్నట్లు తెలిపారు. మరో అతిథి దండు జగన్నాథరాజు మాట్లాడుతూ ఎన్నార్పీ అగ్రహారం కేవీకే స్థాపించిన సమయంలో తాను పనిచేశానని, రైతులను ప్రోత్సహించి వరి విత్తనోత్పత్తి, శ్రీవరి సాగు, చౌడు భూముల అభివృద్ధి, వరిలో సన్నగింజ రకాలు, హైబ్రీడ్ వరి రకాలు పండించి ఈ ప్రాంతానికి అనువైన బీపీటీ జగిత్యాల రకాలను రైతులు విరివిగా పండించేట్లు చేశామని తెలిపారు. అనంతరం అభ్యుదయ రైతులు ఐవీ నర్సింహరాజు, యస్.చల్లారావు, బి.శ్రీనివాసరావు, తాడితోట నర్సింహరావు, రవిరాజు, జే లక్ష్మీనారాయణ కేవీకేతో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.సంధ్య, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.దెబోరా, డాక్టర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ పి.వినయలక్ష్మి, రజిత, రైతులు పాల్గొన్నారు.

సరికొత్త ఫీచర్లతో 'ఈస్టర్న్ పవర్' యాప్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ 'ఈస్టర్న్ పవర్' మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చిందని ఆ సంస్థ ఏలూరు సర్కిల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగదారుని 16 అంకెల విద్యుత్ సర్వీసు నంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చన్నారు. యాప్‌లో 'బిల్ పే' ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను అదనపు రుసుము లేకుండా సులభంగా చెల్లించవచ్చన్నారు. అంతేకాకుండా వినియోగదారుని సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చన్నారు. మై యూసేజీ ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చన్నారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని వివరించారు.